అన్ని హంగులతో గ్రంథాలయం

- ప్రారంభానికి సన్నాహాలు
- రూ.1.25 లక్షలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు
- ఆధునిక, సాంకేతిక పద్ధతిలో సేవ
- పాఠకులకు ఇంటర్‌నెట్ సౌకర్యం


ఆమనగల్లులో నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవనం

ఆమనగల్లు: అక్షర రూపం దాల్చిన ఒక సిరా చుక్క లక్ష మెదళ్లను కదలిస్తుందని అన్నారు పెద్దలు. జాతీయోద్యమకాలంలో అభ్యుదయవాదులకు ఒక్కడుగు ముందుకు వేయడానికి గ్రంథాలయోద్యమం దీపదారిగా నిలించింది. పుస్తక పఠనం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఆ రోజుల్లోనే గ్రంథాలయాల స్థాపన జరిగింది. నాడు ప్రారంభమైన ఈ గ్రంథాలయాలు నేడు డిజిటల్, మోడల్ గ్రంథాలయాలుగా రూపాంతరం చెందుతున్నాయి. రూ.1.25 కోట్లతో ఆమనగల్లులో నిర్మించిన మోడల్ గ్రంథాలయ భవనం అన్ని హంగులతో ప్రారంభానికి సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఎన్నికల కోడ్ రాకముందే ప్రారంభించడానికి అధికార పార్టీ నాయకులు సన్నాహకాలు చేస్తున్నారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కృషితో..

పట్టణంలోని అంగడిబజార్‌లో జవహర్ శాఖ ఆంధ్ర గ్రంథాలయ భవనాన్ని 70 ఏళ్ల క్రితం నిర్మించారు. భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవనం నిర్మించాలని ప్రజలు కోరారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి కృషితో గ్రంథాలయ భవన నిర్మాణానికి రూ.1 కోటి మంజూరయ్యాయి. భవన నిర్మాణ పనులకు గతేడాది మంత్రులు సబితారెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ నారాయణరెడ్డి శంకుస్థాపన చేశారు.

విశాలమైన గదులు

గ్రంథాలయ భవన నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి అయ్యాయి. అయితే అసంపూర్తి పనులకు, ప్రహరీ నిర్మాణానికి అదనపు నిధులు అవసరమయ్యాయి. ఈ నేపథ్యంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో రూ.25 లక్షలు మంజూరు కావడంతో పనులను పూర్తిచేశారు. భవన నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, డైరెక్టర్ రాధమ్మ పర్యవేక్షిస్తున్నారు. నూతన భవనంలో పాఠకులకు కావాల్సిన విధంగా విశాలమైన గదులు, ఇంటర్‌నెట్ సౌకర్యం, కంప్యూటర్లు, వాష్ రూంలు నిర్మించారు. ఆధునిక, సాంకేతిక పద్ధతిలో సేవలందించేందుకు అన్ని హంగులతో మాడల్ భవనం నిర్మించారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు భరోసా

- సీఎం సహాయనిధి ప్రజలకు వరం
- పథకం ద్వారా కార్పొరేట్ వైద్యం
- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో భరోసా ఇస్తుందని, ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కోరారు. సీఎంఆర్‌ఎఫ్ పథకం నిరుపేదలకు వరంలాంటిదని ఆయన అన్నారు. మాడ్గుల మండలం జర్పులతండాకు చెందిన చిట్టికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.2.50 లక్షలు, అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వెంకటయ్యకు రూ.91 వేలు, ఇర్విన్ గ్రామానికి చెందిన ఇంద్రసేన్‌రెడ్డికి రూ.24 వేలు మంజూరయ్యాయి. ఆదివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. సీఎంఆర్‌ఎఫ్ ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతోందని ఎమ్మెల్యే చెప్పారు. అవగాహన లేక పథకాన్ని పలువురు పొందలేకపోతున్నారని, వైద్య ఖర్చులకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా సాయం అందుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, వెంకటయ్యగౌడ్, జంగయ్యయాదవ్, జైపాల్‌నాయక్, మాడ్గుల మండలం బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

క్లుప్తంగా

ఎమ్మెల్యే పర్యటన నేడు

తలకొండపల్లి: మండలంలోఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సోమవారం పర్యటించి, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారని పీఏ నరేశ్ ఆదివారం తెలిపారు. అంతారంలో, అంతారం నుంచి జూలపల్లి వరకు బీటీ రోడ్డు మరమ్మతులు, జూలపల్లి నుంచి గట్టుఇప్పలపల్లి వరకు బీటీ మరమ్మతు పనులు, లింగరావుపల్లి నుంచి పడకల్ వరకు బీటీ రోడ్డు, ఫూల్ సింగ్ తాండలో బీటీ నిర్మాణం పనులకు శంకుస్థాపనలు, పడకల్‌లో వైకుంఠదామం, రైతువేదిక, పూల్‌సింగ్ తండాలో వైకుంఠ దామాన్ని ఎమ్మెల్యే ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలను నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

నేడు 'గడప గడపకూ కాంగ్రెస్'

కడ్తాల్: మండల పరిధిలోని న్యామతాపూర్ గ్రామంలో సోమవారం ఉదయం గడప గడపకు కాంగ్రెస్ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచంద్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండావిష్కరణ కార్యక్రమంతో పాటు, పార్టీ ప్రకటించిన 6 గ్యారంటీ స్కీంలను ప్రజలకు వివరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు

84వ రోజుకు చేరిన దీక్షలు


దీక్షలు చేస్తున్న జేఏసీ నాయకులు

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు చేస్తున్నారు. ఆదివారం ఈ దీక్షలు 84వ రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వం తమ గోడును పట్టించుకోవడం లేదని జేఏసీ నాయకులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి మండలముగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు దామోదర్, డేవిడ్, చంద్రయ్య, శ్రీను, నరసింహ, కృష్ణయ్య, నాగయ్య, అంజయ్య, మల్లేశ్, రామకృష్ణ, మల్లయ్య, మల్లారెడ్డి, లక్ష్మయ్య, వెంకటేశ్, చెన్నయ్య, జంగయ్య, ముత్యాలు పాల్గొన్నారు.

గణనాథుడి కలశాన్ని దక్కించుకున్న అశ్విని


కలశంతో అశ్విని కుటుంబసభ్యులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి మన్నెగూడలోని తిరుమల హోమ్స్‌లో నెలకొల్పిన గణనాథుడి కలశాన్ని మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు అశ్విని దంపతులు రూ.1.41 లక్షలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని తట్టిఅన్నారం, కుంట్లూర్ గ్రామాల్లోని వార్డుల్లో సోమవారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని కమిషనర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. చైర్‌పర్సన్ స్వప్న అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

వ్యక్తిపై ఫిర్యాదు


ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేసిన బీఎస్పీ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: బీఎస్పీ తెలంగాణ చీఫ్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై అనుచిత వాఖ్యలు చేసిన ఎన్ఆర్ఐ బోడ రాజుపై చర్యలు తీసుకోవాలని ఆదిబట్ల మున్సిపాలిటీ బీఎస్పీ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు దాసు, మహేందర్‌లతో పాటు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

మంచాల: పేద విద్యార్థులకు సహకారం అందిస్తామని వీఆర్‌వన్ ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ భిక్షపతి అన్నారు. మంచాల మండలంలోని లోయపల్లికి చెందిన ప్రవీణ్ అనే విద్యార్థి నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించాడు. ఆదివారం ప్రవీణ్‌కు రూ.25 వేలు ఆర్థిక సాయం అందించి ఉన్నత విద్యకు సహకరిస్తామని ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు.

ప్రజల రుణం తీర్చుకుంటా


అంబేద్కర్ భవనాన్ని ప్రారంభిస్తున్న కిషన్‌రెడ్డి, శివధర్‌రెడ్డి

- పాలమూరు-రంగారెడ్డితో ఇబ్రహీంపట్నంకు సాగునీరు
- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- రూ.92 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం

ఇబ్రహీంపట్నం రూరల్: పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా శివన్నగూడ రిజర్వాయర్ నుంచి ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాలకు సాగునీరు అందించి పట్నం ప్రజల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మండలంలోని తులేకలాన్ గ్రామంలో రూ.92 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు, మహిళా, అంబేద్కర్ విజ్ఞాన భవనాలను అడిషనల్ డీజీ శివధర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లోని 270 చెరువులు నింపుతామని, దీంతో 70 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. తులేకలాన్ గ్రామం ఎంతో చైతన్యవంతమైన గ్రామమని కొనియాడారు. గ్రామంలో అభివృద్ధి కోసం యువత ముందుడుగు వేయడం అభినందనీయమన్నారు. తులేకలాన్ నుంచి ధర్మన్నగూడ వరకు రోడ్డు నిర్మాణం కోసం కోటి రూపాయలు మంజూరు చేశామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందుతోందని తెలిపారు. పుట్టిన గ్రామానికి ఎంత చేసినా తక్కువేనని, గ్రంథాలయం ఏర్పాటు చేస్తే అవసరమైన పుస్తకాలు అందజేస్తానని, గ్రామ అభివృద్ధి కోసం తన వంతు సహకారం అందిస్తానని అడిషనల్ డీజీ శివధర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి, ఎంపీపీ కృపేష్, వైస్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ యాదగిరి, ఎంపీటీసీ నాగమణి, ఉప సర్పంచ్ రాజిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాములతో పాటు వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

గ్రూపు రాజకీయాలు వదిలేద్దాం

- 'పట్నం' గడ్డపై కాంగ్రెస్‌ను గెలిపిద్దాం
- 'గ్యారంటీ'తో పార్టీకి పూర్వ వైభవం
- ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి అక్రమాలను అరికట్టండి
- పీసీసీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: గ్రూపు రాజకీయాలు వదిలేసి.. పార్టీ గెలుపు కోసం కృషి చేద్దామని పీసీసీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్ పర్సన్ స్రవంతి, మాజీ సర్పంచ్ లక్ష్మయ్య కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక సాయి ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ నాయకులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రంగారెడ్డి మాట్లాడుతూ పార్టీ ఎవరికీ టికెట్ కేటాయించిన అభ్యర్థి విజయానికి కలిసికట్టుగా కృషిచేయాలని కోరారు. ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి అక్రమాలను అరికట్టాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 9న జరిగే కుర్మ ఆత్మీయ సమ్మేళనానికి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాబోతున్నారని, ఆయన చేత బీసీ డిక్లరేషన్‌ను పార్టీ విడుదల చేయిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని సర్వేలు వెల్లడిస్తున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీ నిరంజన్‌రెడ్డి, జెడ్పీటీసీ మహిపాల్, పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసుధన్ రెడ్డి, జిల్లా నాయకుడు శేఖర్‌గౌడ్, జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు జయమ్మ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పండాల శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీకి అనుమతించని పోలీసులు

లక్ష్మీనృసింహస్వామి ఆలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు కాంగ్రెస్ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. అయితే ర్యాలీకి పోలీసులు అనుమతి ఇవ్వలేదు. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి, మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మోహరించారు. పోలీసుల తీరుపై కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

గౌడసంఘం అధ్యక్షుడిగా సాంబయ్య


గౌడ సంఘం నూతన కమిటీ

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల పట్టణ గౌడసంఘం నూతన అధ్యక్షుడిగా సాంబయ్యగౌడ్‌ను ఎన్నుకున్నారు. ఆదివారం స్థానికంగా గౌడ సంఘం సమావేశం జరిగింది. ఈ భేటీలో నూతన కమిటీని ఎన్నికున్నారు. అధ్యక్షుడిగా పల్లె సాంబయ్యగౌడ్, డైరెక్టర్లుగా చిన్న యాదయ్య, నరేందర్‌గౌడ్, శేఖర్‌గౌడ్, శంకరయ్యగౌడ్‌లను ఎన్నుకున్నారు. గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలతో అంగన్‌వాడీల నిరసన


యాచారం: మంత్రి సత్యవతి రాథోడ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

ఆమనగల్లు: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె ఆదివారం 14వ రోజుకు చేరుకుంది. ఆమనగల్లు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో అంగన్‌వాడీలు కళ్లకు గంతలు కట్టుకుని మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు కురుమయ్య, అంగన్‌వాడీ ఉద్యోగులు అనసూయమ్మ, పద్మ, సంధ్య, అలివేలు, సబిత, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

మంత్రి దిష్టిబొమ్మ దహనం

యాచారం: యాచారం మండల కేంద్రంలో ఆదివారం మంత్రి సత్యవతి రాథోడ్ దిష్టిబొమ్మను అంగన్‌వాడీ సిబ్బంది దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి సమస్యలు పరిష్కరించకుండా అంగన్‌వాడీ సిబ్బందిని కించపర్చేలా మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఆమె అలా మాట్లాడడం సరైంది కాదని అన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్‌వాడీ సిబ్బందికి మద్దతుగా సీఐటీయూ నాయకులు బ్రహ్మయ్య, చందునాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించాలి

మంచాల: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని సీఐటీయూ మండల కన్వీనర్ కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం మంచాల మండల కార్యాలయం ఎదుట నిర్వహించిన అంగన్‌వాడీ వర్కర్ల దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్ల విషయంలో మంత్రి సత్యవతి రాథోడ్ పొంతన లేని మాటలు మాట్లాడడం సరైంది కాదన్నారు. అంగన్‌వాడీ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అంగన్‌వాడీలకు అండగా ఉండి పోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్‌అండ్‌హెల్పర్స్‌యూనియన్ నాయకురాలు జ్యోతి, యాదమ్మ, జయమ్మ, సుమతమ్మ, మంగమ్మ, లక్ష్మి, పోచమ్మ, పద్మ పాల్గొన్నారు.

వక్రతుండాయ.. వినాయకా..

వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తులు ఘనంగా జరుపుకొంటున్నారు. ఇష్ట దైవం గణనాథుడికి భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. ఏకదంతుని మండపాల వద్ద అన్నసమారాధనలు.. లడ్డూ వేలం పాటలు నిర్వహించారు. కొన్నిచోట్ల సామూహిక వ్రతాలు, కుంకుమ పూజలు, దీపారాధనలు, గణపతి హోమం చేపట్టారు. కొన్ని ప్రాంతాల్లో వక్రతుండాయ.. వినాయకా అంటూ.. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో గణనాథుడిని నిమజ్జనోత్సవానికి తరలించారు.


తుర్కయంజాల్: గణనాథుడి ప్రత్యేక పూజలో పాల్గొన్న మంత్రి మహేందర్ రెడ్డి


ఆమనగల్లు: గణేశుడి పూజలో గోలి శ్రీనివాస్‌రెడ్డి


ఇబ్రహీంపట్నం: పవన్‌పురి కాలనీలో..


మంచాలలో..


తుర్కయంజాల్: ఇంజాపూర్‌లో..


కడ్తాల్: మైసిగండిలో పూజలు నిర్వహిస్తున్న ఎంపీపీ, భక్తులు


నస్దిక్‌సింగారంలో..

అభివృద్ధిలో భాగస్వాములుకండి


భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న దశరథ్‌నాయక్

కడ్తాల్: గ్రామాల అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ కోరారు. మండలంలోని రావిచేడ్ గ్రామంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో మంజూరైన డీఎంఎఫ్ నిధులతో నిర్మిస్తున్న శాలివాహన భవన నిర్మాణ పనులను జెడ్పీటీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్, రైతుబంధు జిల్లా సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, ఉప సర్పంచ్ వెంకటేశ్, నాయకులు బాలకృష్ణ, రమేశ్‌యాదవ్, విఠలయ్యగౌడ్, పవన్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం

తలకొండపల్లి: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని పీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమాన్ని అభివృద్ధిని పూర్తిగా విస్మరించారన్నారు. సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళ్తోందన్నారు. ప్రజలను నమ్మించి మోసం చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని తరిమి కొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. తుక్కుగూడ సభలో ప్రకటించిన 6 గ్యారంటీ స్కీములతో పార్టీకి పూర్వ వైభవం రానుందన్నారు. అధికారంలోకి రాగానే ప్రతి కుటుంబంలోని మహిళకు నెలకు రూ. 2,500 నగదు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ. 500కే వంట గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం తదితర పథకాలను అమలు చేస్తామన్నారు.

యాచారాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తా

ఎంపీపీ కొప్పు సుకన్య


యాచారంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ తదితరులు

యాచారం: మండల కేంద్రాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తానని ఎంపీపీ సుకన్య పేర్కొన్నారు. యాచారం గ్రామ పంచాయతీలో ఆదివారం రూ.30 లక్షల అభివృద్ధి పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సుకన్య మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ ముదిరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని అన్నారు. యాచారంలోని ఎస్‌బీఐ ముందు కాలనీలో రూ. 50 లక్షల నిధులతో విడతల వారిగా డ్రైనేజీ కాల్వలు నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ జంగమ్మ, ఉప సర్పంచ్ గొల్లపల్లి లలిత, వార్డు సభ్యులు నాగరాజు, జయమ్మ, కృష్ణ, శ్రీనువాస్‌రెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.